క్లుప్తంగా...

ప్రత్యేక పూజలు



గోల్కొండ: గోల్కొండ కోటలోని మహంకాళి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారి బి.సురేష్‌చారి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన చిత్ర కళా ప్రదర్శన



సమావేశంలో చిత్రకారులతో డాక్టర్ జ్యోత్స్న, శంకర రావు, స్వామి, శివకుమారి

నాంపల్లి: సిరి పెయింటింగ్ ఇనిస్టిట్యూట్, సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో గడచిన మూడు రోజులుగా జేఎన్ఏఎఫ్ఏయూ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించిన చిత్ర కళా ప్రదర్శన ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా కేన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ జ్యోత్స్న, ఎస్‌బీఐ బ్యాంక్ మాజీ మేనేజర్ జి.శంకరరావు హాజరయ్యారు. ప్రదర్శనలోని చిత్రాలను వారు వీక్షించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. చిత్ర కళా ప్రదర్శనలో పాల్గొన్న 25 చిత్రకారులను సత్కరించారు. సిరి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు స్వామి, శివకుమారి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పత్తిపాక మోహన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గజల్ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కోరుప్రోలు మాధవరావు రచించిన అలకనంద పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా దక్షిణ ప్రాంత అధికారి పత్తిపాక మోహన్ మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో గజల్స్ ప్రాముఖ్యతను యువతరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. పలు అంశాలపై రచయిత గజల్ రాసిన తీరు ఎంతో చక్కగా ఉందని రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ న్యాయమూర్తి నేరేళ్ల మాల్యాద్రి, గజల్ సాహిత్య వేదిక అధ్యక్షుడు ఇ.వెంకటేశ్వర శర్మ, తంగిరాల చక్రవర్తి, ఉమాదేవి, ప్రసాదరావు, ముకుంద సుబ్రహ్మణ్య శర్మ, వెంకట్ పాల్గొన్నారు.

గన్‌ఫౌండ్రీలో బోనాల వేడుకలు



పూజల్లో మమతాగుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: శ్రావణమాసం బోనాల వేడుకలు గన్‌ఫౌండ్రీలోని పలు ఆలయాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంతోష్‌గుప్తా పాల్గొని పూజలు చేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



గోల్కొండ: ప్రైమరీ స్కూల్ నుంచి కళాశాల వరకు కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు ఆదివారం మళ్లీ కలుసుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం వీరంతా టోలిచౌకీ టూంబ్స్ చౌరస్తా వద్ద గల రాయల్ టింబర్ స్టోర్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల్లో ఉన్నా తామంతా ఫోన్‌లలో ఒకరికొకరు పలకరించుకుంటామని ఒకరి కష్ట సుఖాలలో మరొకరు తోడుగా ఉంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాలేద్ అలీఖాన్, ఇస్మాయిల్, మహబూబ్, రఫత్ తదితరులున్నారు.

రహదారి.. చెత్తగా మారి

- అపరిశుభ్రంగా ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే సర్వీసు రోడ్డు
- ఇబ్బందులకు గురవుతున్న వ్యాపారులు, ప్రయాణికులు
- సుందరీకరణ పనులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



చెత్తాచెదారాలు, మూత్రవిసర్జనతో అపరిశుభ్రంగా ఉప్పుగూడ రైల్వేస్టేషన్ రోడ్డు

గౌలిపురా: ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే సర్వీసు రోడ్డు పూర్తిగా అపరిశుభ్రంగా తయారయ్యింది. ఈ ప్రాంతంలో మూత్ర విసర్జన, చెత్తపారవేస్తుండటంతో స్థానికంగా తీవ్ర దుర్గంధంగా మారింది. దీంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ నుంచి ప్రతిరోజు వందలాది మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో మహిళలు, విద్యార్థినులు, వృద్ధులు రాకపోకలు సాగించే సమయంలో దుర్వాసనను భరించలేకపోతున్నారు. అపరిశుభ్రంగా మారిన ప్రాంతంలో పెద్ద ఎత్తున దోమలు వృద్ధి చెంది స్థానిక ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే ఆజంపురా, డబీర్‌పురా, రెయిన్‌బజార్ వద్ద ఐ లవ్ యు ఆజంపురా, ఐ లవ్ యు డబీర్‌పురా, ఐ లవ్ యు రెయిన్‌బజార్ అంటూ ఏర్పాటు చేశారు. అదే విధంగా ఉప్పుగూడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను మూత్రవిసర్జన, చెత్తాచెదారాలను వేయకుండా పరిశుభ్రంగా చేసి ఐ లవ్ యు ఉప్పుగూడ అని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి..



ఈ ప్రాంతంలో చెత్తాచెదారాలను వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలి. చెత్తాచెదారాలతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మా దుకాణానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి నుంచి చెత్త పాయింట్‌ను తొలగించి వెంటనే సుందరీకరణ పనులను చేపట్టాలి.

– డి.లక్ష్మయ్య, వ్యాపారి, ఉప్పుగూడ

సుందీకరణ పనులు చేపట్టాలని కోరాం..



ఉప్పుగూడ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి సుందీకరణ కోసం ఇప్పటికే ఉన్నతాధికారుల కోసం ప్రతిపాదనలు పంపాం. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న అపరిశుభ్రత వాతావరణాన్ని పూర్తిగా తొలగించి సుందీకరణ పనులు చేపట్టాలని కోరాం.

– ఆలే భాగ్యలక్ష్మి, గౌలిపురా కార్పొరేటర్

తెలంగాణ రత్నాల గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రముఖ రచయిత అనువాదకుడు తెలంగాణ అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు దివంగత దేవులపల్లి ప్రభాకర్‌రావు రచించిన 'తెలంగాణ రత్నాలు' అనే గ్రంథావిష్కరణ సభ ఆదివారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని తెలుగు భాషా నిలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, భాషా నిలయం అధ్యక్షుడు డాక్టర్ కేవీ రమణాచారి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..89 మంది తెలంగాణ ప్రముఖుల గురించి పెన్షనర్ల ఉద్యమంపై ప్రభాకర్‌రావు నెల నెల రచించిన తెలంగాణ ప్రముఖుల జీవిత చరిత్రకు సంబంధించిన వ్యాసాలను శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయం పక్షాన టి.ఉడయవర్లు సంపుటీకరించిన భాషా నిలయం ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్‌రావు నేతృత్వంలో భాషా నిలయం ప్రచురించిందని తెలిపారు. ఇలాంటి రచనలు ప్రజల్లో రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం రమణాచారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.నర్సింహా మూర్తి, జగదీశ్వర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్య నిషేధం విధించాలి



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సును రద్దుచేసి సంపూర్ణ మద్య నిషేధం విధించాలని తెలంగాణ ఆటో జేఏసీ కన్వీనర్ అమానుల్లా ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి దివంగత ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడిస్తే రాష్ట్రంలో ఫ్రీ బస్సులకు బదులు సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న నగరంలో ఒక్కరోజు ఆటో బంద్‌కు తాము పిలుపునిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, హత్యలు, నేరాలు ఘోరాలు, మహిళలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నియంత్రించడానికి రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం విధించడం తప్పా మరో గత్యంతరం లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో పెరిగిన ఆర్‌టీఏ సర్వీస్ ఛార్జీలు పుండుమీద కారం చల్లినట్లు ఉందని కాబట్టి జీఓ నెంబర్ 51ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఆదర్ల మహేశ్

గౌలిపురా: గౌలిపురా మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్‌లో ఆదివారం రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సెలక్షన్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్ పాల్గొని రాష్ట్రస్థాయి సెలక్షన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్ల మహేశ్ మాట్లాడుతూ..యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, రాష్ట్ర కార్యదర్శి సంతోష్, నల్గొండ సెక్రటరీ నవీన్, కోచ్‌లు రాఘవేంద్ర, బి.సాయి కుమార్, జి.పి.పృథ్వీరాజ్, ఎ.భానుప్రకాశ్, వివిధ జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ అదనపు డీసీగా సురేందర్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన సురేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అదనపు ఉప కమిషనర్‌గా బి.సురేందర్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారానికి, మెరుగైన వసతుల కల్పనకు, సర్వతోముఖాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. సర్కిల్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న శైలేష్ కుమార్

చాంద్రాయణగుట్ట: వీధి కుక్కలకు ఎప్పటికప్పుడు యాంటీ రెబీస్ వ్యాక్సిన్‌లు వేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నర్కెట్‌పల్లి శైలేష్ కుమార్ కోరారు. పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన యాంటీ రెబీస్ వ్యాక్సిన్ కేంద్రంలో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. శైలేష్ కుమార్ మాట్లాడుతూ..ఇటీవల వీధి కుక్కలు దాడులు చేస్తున్న ఘటనలో ఎంతో మంది చిన్నారులు గాయాలకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో క్యాంప్ నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అధికారులు మహ్మద్ ఫయాజ్, డాక్టర్ అబ్దుల్ వసీ సిద్దిఖీ, శ్రీకాంత్, మహ్మద్ వాసీం, నాయకులు మహేష్ కుమార్, అశోక్, సుధాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సత్యనారాయణ

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా దళితులు, బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న పథకాలను అన్ని వర్గాల ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. షేక్‌పేట్‌లో పలు అభివృద్ధి పనుల కోసం మంత్రి వివేక్ సోమవారం పర్యటించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజు, జ్ఞానేశ్వర్, రఘురామ్, అజయ్ తదితరులున్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలను అందజేస్తున్న ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్ రెడ్డి తదితరులు

అఫ్జల్‌గంజ్: మారుతున్న సాంకేతిక విప్లవంలో విద్యార్థులు పోటీతత్వాన్ని అధిగమించి విలువలతో కూడిన జీవనం గడిపేందుకు ముందుకు సాగాలని జేఎన్‌టీయూ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సాంకేతిక విద్యలో కొత్త కొత్త మార్పులు వస్తూ పోటీతత్వాన్ని పెంపొందిస్తున్నాయన్నారు. స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్, ప్లేస్‌మెంట్ డే వేడుకలను కళాశాల కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గిరిధర్ ఆకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక విద్యలో రెండేళ్లుగా విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. దానికి అనుగుణంగా అధ్యాపకులు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు టీసీఎస్.కిశోర్ నియామక పత్రాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ బ్రహ్మోత్సవాలు



పూజల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో ఆలయ కమిటీ సభ్యులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్‌కాలనీ దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరం 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు పూర్ణ శంగోళం, దివ్య ప్రబంధ, సేవాకాల పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షులు గొరిగే శ్రీనివాస్, ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు సామల శ్రీనివాస్ బి.రమేష్‌కుమార్, దాస శ్రీనివాస్, అన్నపురం రమేష్‌కుమార్, వి.భుజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి పని వారికి గౌరవ భత్యం పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఆలయ కార్యనిర్వహణ అధికారిని వసంత

గోల్కొండ: గోల్కొండ బోనాలను విజయవంతంగా నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.వసంత అన్నారు. ఆదివారం కోటలోని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అమ్మవారి వృత్తిపని వారికి గౌరవ భత్యం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు, నాగేశ్వర్‌రావు, సత్యం రెడ్డి తదితరులున్నారు.

వృత్తిపని వారి మధ్య వాగ్వాదం..

గౌరవ భత్యం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వృత్తిపని వారి మధ్య వాగ్వాదం కాస్తా తోపులాటకు దారి తీసింది. ఆలయ ప్రాంగణంలో కొంత కాలం క్రితం ఏర్పాటు చేసిన వృత్తిపని వారి పేర్ల తొలగింపుపై సంఘం అధ్యక్షుడు టి.శివశంకర్‌తో బి.శ్రీకాంత్‌చారికి వాగ్వాదం చోటు చేసుకుంది. వృత్తిపని వారి పేర్ల తొలగింపుపై శ్రీకాంత్ ప్రశ్నించగా ఈ వాగ్వాదం చోటు చేసుకుంది.

విద్యారంగ వ్యాప్తికి 'లిటిల్‌ఫ్లవర్' విశేష కృషి



కార్యక్రమంలో పాల్గొన్న రేవ్ బ్రదర్ షజాన్ ఆంథోని తదితరులు

అబిడ్స్: విద్యారంగ వ్యాప్తికి లిటిల్‌ఫ్లవర్ విద్యాసంస్థలు విశేష కృషి చేస్తున్నాయని సెయింట్ గాబ్రియేల్ పూణె మోట్‌ఫోర్ట్ రేవ్ బ్రదర్ షజాన్ ఆంథోని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అబిడ్స్ లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన రేవ్‌బ్రదర్ షజాన్ ఆంథోని పూణె మోంట్‌ఫోర్ట్ బ్రదర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రేవ్‌బ్రదర్ షజాన్ ఆంథోని మాట్లాడుతూ..కొన్ని సంవత్సరాల పాటు అబిడ్స్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించే విధంగా విద్యావిభాగం, క్రీడలు, సాంస్కృతిక రంగాలు, సామాజిక రంగాల్లో తీర్చిదిద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంథోని పాలిశెట్టి, ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, సినీనటుడు రాజ, అరవింద్ సెన్‌జీ ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫర్, సంపత్‌కుమార్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో బాక్సింగ్‌కు ఆదరణ పెరుగుతోంది'



జాతీయ సబ్‌జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన చిన్నారులు

గోల్కొండ: తెలంగాణలో బాక్సింగ్‌కు ఆదరణ పెరుగుతుందని తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.రవీందర్ అన్నారు. జాతీయ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన వారికి ఆదివారం షేక్‌పేట్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో క్రీడాకారులకు ట్రాక్ షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత నెలలో షేక్‌పేట్‌లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సెలక్షన్స్ పోటీలు జరిగాయని, వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన 30 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. సబ్ జూనియర్ జాతీయ స్థాయికి ఎంపికైన వారికి కీస్టోన్స్ స్కూల్ కరస్పాండెంట్ రాంరెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి వినేష్ బాబు, ప్రముఖ బాక్సర్ నిఖత్ జరీన్ తండ్రి జమీల్ అహ్మద్, శివకుమార్ తదితరులున్నారు.

సాహిత్య రంగానికి మాచిరాజు చేసిన సేవలు ఎనలేనివి



పురస్కార గ్రహీతలతో చొక్కాపు వెంకటరమణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సాహిత్య రంగానికి మాచి రాజు చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాల సాహిత్య పరిషత్, మాచి రాజు బాల సాహిత్య పీఠంల సంయుక్తాధ్వర్యంలో మాచి రాజు సీతారామయ్య పేరిట స్మారక బాలసాహిత్య పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రముఖ రచయితలు ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, నాగేశ్వర్‌రావుకు ఈ పురస్కారాలను అందజేశారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్, బాల సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ..చందమామ కథలతో మాచిరాజు ఎంతో మందికి దగ్గరయ్యారని గుర్తుచేశారు. అంతకు ముందు చందమామ కథలు, బాల కథాచంద్రిక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రప్రతాప్, శ్రీనివాసకుమార్, పైడిమర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య శిక్షణాలయం, భారతనాట్యాలయం సంస్థ ఆధ్వర్యంలో నాట్య గురువు డాక్టర్ చిత్ర నారాయణన్ శిష్యులు తనీషా రెడ్డి, హనీషా రెడ్డి భరతనాట్య ఆరంగేట్రం ఆదివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పుష్పాంజలి, వర్ణం, తొడై మంగళం, మహాదేవ శివ శంభో, తక్కువేమి మనకు, థిల్లాన వంటి అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ..పాఠశాల స్థాయి నుంచే చిన్నారులకు శాస్త్రీయ కళలపై మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ అధ్యక్షుడు మురళి ముకుంద్, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించొద్దు



ఆందోళనలో పాల్గొన్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గంధంగూడలోని పలు కాలనీల మధ్యలో మురికినీటి శుద్ధి కేంద్ర నిర్మాణాన్ని (ఎస్‌టీపీ) చేపట్టవద్దని.. అందుకు సంబంధించిన పనులను తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గంధంగూడలో పర్యటించారు. విఘ్నేశ్వర కాలనీ, కేకే ఫేస్-2, దత్తాత్రేయ కాలనీ, బృందావన్ కాలనీ, రంగారెడ్డి కాలనీ వాసులు మురుగు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీ, ధర్నాలో ఆయన పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ... నివాస ప్రాంతాల మధ్య నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల దుర్వాసనతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ, శబ్ద కాలుష్యం తదితర సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. శ్వాస కోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది ప్రమాదకరమని హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్ మాలతీనాగరాజు, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రావుకోళ్ల నాగరాజు, పలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.